క్లుప్తంగా

చెక్‌పోస్ట్ ఏర్పాటు



కారు డిక్కీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ దేవి

మెంటాడ: మండలంలోని ఆంధ్ర నుంచి పిట్టాడ వెళ్లే మార్గంలో పోలీసులు శనివారం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఇదే దారిలో వాహనాల ద్వారా గంజాయి రవాణా జోరుగా జరుగుతోందన్న సమాచారం మేరకు ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి, తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్‌ఐ బొడ్డు దేవి తెలిపారు. అనంతరం అటువైపుగా వచ్చే వాహనాల్లో తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



బొబ్బిలి: స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్న సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు

బొబ్బిలి/రామభద్రపురం: మండలాల్లో స్నేహితుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థుల్లో మిత్రులుగా ఉన్న వారంతా తమ స్నేహంలో గుర్తుండిపోయే సన్నివేశాలు, సంఘటనలు మరోసారి గుర్తుచేసుకుని సరదా సరదాగా గడిపారు. అనంతరం ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మన స్నేహం ఇలాగే కలకాలం నిలవాలని ఆకాంక్షించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి: వీణల తయారీదారులకు రెండు నెలల పాటు ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విశాఖ లేపాక్షి సీఈవో ఎ.కార్తీక్ కోరారు. మండలంలోని గొల్లపల్లి వీణల కేంద్రంలో పనిచేస్తున్న వీణల తయారీదారులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. హస్త కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణలో వీణల తయారీలో మరింత మెరుగైన నైపుణ్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, మొత్తం 20 మందికి శిక్షణ ఇస్తున్నామని వీణల కేంద్రం ఇన్‌చార్జి రామకృష్ణ తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో కుష్టువ్యాధి నిర్మూలన



వ్యాధి లక్షణాలు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

రాజాం: ముందస్తు జాగ్రత్తలతోనే కుష్టువ్యాధి నిర్మూలన సాధ్యమని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భార్గవి అన్నారు. పొగిరి, గురవాం గ్రామాల్లో శనివారం కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టు లక్షణాలను గుర్తించిన వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో ఇంటింటా కుష్టువ్యాధి సర్వే నిర్వహించారు. పొగిరి పీహెచ్‌సీ పరిధిలో కొత్త కేసులు లేవని తెలిపారు.

విరాళాల సేకరణ

బొబ్బిలి: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు స్థానిక పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ శనివారం చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం తదితరులంతా కలిసి పట్టణంలోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి, విరాళాలు అడిగారు. మొత్తం రూ.4,200 సేకరించామని వారు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

రేగిడి: మండల తహసీల్దార్‌గా డి.ఎల్లారావు నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పాలకొండ ఆర్‌డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహించిన ఆయన ఇటీవల బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.వి.రమణారావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, 27న కళాశాలకు వచ్చి, ధ్రువపత్రాలు పరిశీలన చేయించుకోవాలన్నారు. ఈ నెల 29న జరిగే కౌన్సెలింగ్‌కు కూడా అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం కళాశాల సిబ్బందిని పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

ప్రోటోకాల్ పాటించాల్సిందే..

- స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవించాలి
- గ్రామాల్లో చేపట్టే కార్యక్రమాలపై వారికి సమాచారం ఇవ్వాలి
- మండల సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. వివిధ శాఖల ద్వారా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓల వ్యవహార శైలిపై ఆరోపణలు చేశారు. గ్రామాల్లో తాము పంచాయతీ సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా ఉండగా తమకు కనీసం సమాచారం లేకుండా పలు కార్యక్రమాలు గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి ఎటువంటి అధికారం లేని టీడీపీ కార్యకర్తలకు పెత్తనం ఇవ్వడం, సచివాలయాల్లో వారితో కార్యక్రమాలు ప్రారంభించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తమ పదవీకాలం మరో రెండేళ్లు ఉన్నప్పటికీ అధికారుల అత్యుత్సాహం ప్రదర్శించడంపై మండిపడ్డారు.

వ్యవసాయ శాఖలో రాజకీయం..

వ్యవసాయశాఖపై సమీక్ష సమయంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, బూరాడ సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు, కొర్లవలస సర్పంచ్ బంకి చంద్రశేఖర్‌లు ఏఓ మురళీకృష్ణ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. తమ పంచాయతీల్లో రైతు సేవా కేంద్రం ప్రారంభించినప్పుడు ఏఓ కనీసం సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. వ్యవసాయశాఖకు కూడా పచ్చరాజకీయం అంటుకుందని అసంతృప్తి వ్యక్తంచేశారు. విద్యాశాఖ చర్చలో ఎస్‌ఎంసీ ఎన్నికపై ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు మాట్లాడుతుండగా.. సభ్యులు అడ్డుపడ్డారు. ఇంతవరకూ ఆయా పాఠశాలల పరిధిలోని పంచాయతీ సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని నిలదీశారు. తాటిపాడు, అంబఖండి, చాటాయివలస ప్రభుత్వ పాఠశాలలో వంట నిర్వాహకులను తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ ప్రకటించగా.. వారిపై ఎటువంటి ఆరోపణలు లేకుండా, టీడీపీ వాళ్లు చెప్పారని వారిని తొలగించడం సరికాదని సభ్యులు అడ్డుచెప్పారు. వారిని తొలగించరాదని సమావేశంలో తీర్మానం చేసి, కలెక్టర్‌కు పంపించారు. కందిశ పాఠశాలలో నాడు-నేడు పనులు చేయకుండా నిధులు డ్రా చేశారని, నిధులు తినేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కందిశ ఎంపీటీసీ కెల్ల చిట్టెమ్మడు సభను కోరారు. బూరాడ పీహెచ్‌సీలో సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని, ప్రజలకు వైద్యం అందడంలేదని సర్పంచ్ శశిభూషణరావు ఆరోపించారు. సాగునీటి శాఖపై జరిగిన చర్చలో తోటపల్లి 21 ఎల్ నుంచి సాగునీరు రావడంలేదని సోమరాజుపేట సర్పంచ్ సవణాపు రపు రమేష్‌నాయుడు ఆవేదన వ్యక్తంచేశారు.

అధికారులు ప్రోటోకాల్ పాటించాలి

ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ.. అధికారులంతా ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. మరో రెండేళ్ల పాటు స్థానిక సంస్థల అధికారాలు ఉన్నాయని, ఏ పార్టీకి చెందిన వారు ప్రజాప్రతినిధిగా ఉన్నా స్థానికంగా వారిని గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ గౌరవించామని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారుతుంటాయని, అధికారులు మాత్రం తమ బాధ్యత సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, ఎంపీడీఓ శ్యామలాకుమారి, తహసీల్దార్ ఎల్లారావు, పలు పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలను వివరిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి రూరల్: చట్టాలపై అవగాహన అవసరమని, ప్రతిఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. మండలంలోని మోసూరువలస, ఎరకందొరవలస, దొంగురువలస గ్రామాల్లో వైద్యశిబిరం, న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఏ చట్టం ఏం చెబుతోందన్న విషయం తెలిస్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, పిరిడి పీహెచ్‌సీ వైద్యుడు భరద్వాజ, బొబ్బిలి సీహెచ్‌సీ ఈఎన్‌టీ వైద్యురాలు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

రేగిడి: తమకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి భూమి హక్కు కల్పించాలని రేగిడి ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. 2008లో తమకు ఇచ్చిన సెంటు భూమికి సంబంధించిన స్థలాలు ఇచ్చారని, కానీ ఇంతవరకూ వాటి హక్కు కల్పించలేదని వాపోయారు. తమకు కేటాయించిన భూమిపై హక్కు కల్పించాలని, లేదంటే తమ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని అన్నారు. సమస్యను పరిశీలించి, పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎల్లారావు వారికి హామీ ఇచ్చారు.

విద్యుత్ లైన్ మరమ్మతులు

వంగర: మండలంలోని కొప్పర సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభంతో పాటు విద్యుత్ లైన్‌ను అధికారులు సరిచేశారు. జూలై 31న సాక్షిలో ప్రచురితమైన 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే వార్తకు విద్యుత్ శాఖ ఏఈ కోనూరు వినయ్ కుమార్ స్పందించారు. సిబ్బందితో విద్యుత్ స్తంభం, లైన్‌ను సరిచేయించారు.

రైతుల శ్రమదానం



పూడికలు తొలిగిస్తున్న రైతులు

వంగర: మండలంలోని ఓనెఅగ్రహారం తంపర గెడ్డ ఛానల్‌లో పేరుకుపోయిన పూడికలను రైతులు శనివారం శ్రమదానం చేసి తొలగించారు. కాలువలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. ఓనెఅగ్రహారం, మగ్గూరు గ్రామాలకు చెందిన రైతులు పూడికల తొలగింపులో పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బొబ్బిలి రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వనమిత్ర కృష్ణదాసు అన్నారు. మండలంలోని అలజంగి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కల పెంపకానికి ముందుకురావాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

బొబ్బిలి రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ/పాఠశాల యాజమాన్య కమిటీ) ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 91 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఎన్నికలో పాల్గొని, ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారని, ఓటాఫ్ మెజార్టీ విధానం ద్వారా ఫలితాలను వెల్లడిస్తారన్నారు. రెండేళ్ల పాటు కొనసాగే ఈ కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు భాగస్వాములుగా ఉంటారన్నారు. ఈ కమిటీ సభ్యులంతా పాఠశాల నిధుల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలుతీరును పర్యవేక్షిస్తారన్నారు. గతంలోని పేరెంట్స్ కమిటీల స్థానంలో ఈ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు వచ్చాయన్నారు.

ఇష్టపడి చదవాలి

రాజాం సిటీ: విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి అలవాట్లు పెంపొందించుకోవాలనిపై మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న పాఠశాలలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పెద్దలను గౌరవించాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధతో నేర్చుకోవాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడీశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని కళ్యాణగౌరీ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన చౌడీశ్వరీదేవి ఆలయ 29వ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు కళ్యాణగౌరీ మల్లికార్జున దేవాంగ సంక్షేమ సంఘం శనివారం తెలిపింది. ఆలయ అర్చకులు హరవిల్లి హరినాథశర్మ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. తొలి రోజు విఘ్నేశ్వరపూజ, కలశస్థాపన, కుంకుమ పూజలు, సాయంకాలం కళాకారుల కోలాటం నడుమ తిరువీధి, లలితా పారాయణం, సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందని వెల్లడించారు. 5న అష్టోత్తర శతనామపూజలు, 8న కుంకుమపూజలు, 7న విశేష పూజలు, పూర్ణాహుతి, ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు.. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని, అప్పుడే పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని, శిశువుకు అది సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తుందని, రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుందని తెలిపారు. ప్రతీ తల్లి తన బిడ్డకు పాలు ఇవ్వడాన్ని బాధ్యతగా భావించాలన్నారు.

-రాజాం, బొబ్బిలి



తెర్లాం: బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చిట్టెమ్మ



తెర్లాం: కూనాయవలస అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



తెర్లాం: పెరుమాళిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రాజాం: బాబానగర్‌లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సన్యాసమ్మ



బొబ్బిలి: మల్లంపేటలో గర్భిణులకు సీమంతం నిర్వహించిన దృశ్యం



వంగర: మండల కేంద్రంలో తల్లిపాల ప్రయోజనాలను తెలియజేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజనీదుర్గ



రేగిడి: తాటిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలు, సిబ్బంది

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్‌ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వివేక్‌ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, న్యాయవాదులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణ అధికమైందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో పాటు జీవితాలు నాశనమవుతాయన్నారు. ఇందులో చిన్నారులను భాగస్వాములను చేస్తున్నారని, అటువంటి వారిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి చట్టపరమైన అన్ని న్యాయసేవలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, ప్రాంతీయ ఆస్పత్రి వైద్యులు ఆదర్శ్, ఎక్సైజ్ ఎస్సై ఎస్.చంద్రశేఖర్, ఎస్సై షేక్ శంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు, వై.ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

రాజాం సిటీ: తనను పట్టణ పరిధి తెలగవీధికి చెందిన బావరాజు వెంకటేష్ దాడిచేసి గాయపర్చాడని అదే వీధికి చెందిన శెట్టి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్సై వై.రవికిరణ్ శనివారం తెలిపారు. ట్యూషన్ సెంటర్ నడుపుకుంటున్న శ్రీనివాసరావు ఈ నెల 2న రాత్రి 8.15 గంటల సమయంలో వీధి చివర్లోని బుక్‌షాపులో పుస్తకాలు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. శెట్టి రెసిడెన్సీ వద్దకు వచ్చేసరికి వెంకటేష్ తనపై కర్ర, రాయితో కొట్టి గాయపర్చాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గాయపడిన శ్రీనివాసరావు స్థానికుల సహాయంతో రాజాం సామాజిక ఆస్పత్రిలో చేరి చికిత్సపొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రికార్డుల నిర్వహణపై అసంతృప్తి



ఈఓ వద్ద వివరాలు ఆరా తీస్తున్న దేవాదాయశాఖ అధికారులు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయంతో పాటు వంగర మండలంలోని సంగమేశ్వర దేవాలయానికి సంబంధించిన రికార్డులకు ఆశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, విజయనగరం ఏసీ అన్నపూర్ణ శనివారం తనిఖీ చేశారు. అర్చకులు, సిబ్బంది జీతభత్యాలు చెల్లించకపోవడాన్ని గుర్తించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై, ఈఓ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో రికార్డులు తీసుకుని డీసీ కార్యాలయానికి రావాలని ఈఓ శివకేశవరావును ఆదేశించారు. నివేదికను దేవాదాయశాఖ కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

31 మంది రైతులకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు



మైక్రోఇరిగేషన్ పైపులను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ, అధికారులు

రాజాం: మండలంలో 31 మంది రైతులకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందించామని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ పి.లక్ష్మీనారాయణ అన్నారు. బొద్దాం గ్రామానికి చెందిన బట్న లక్ష్మణరావు పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 22 మంది రైతులకు రూ.15,23,680లు డ్రిప్ ఇరిగేషన్ పైపులు రాయితీ రూపంలో అందించామని వెల్లడించారు. మరో తొమ్మిది మంది రైతులకు రూ.1,25,437లు విలువ చేసే స్ప్రింక్లర్ పైపులు అందించినట్లు చెప్పారు. డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు, విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కావాలనుకునే రైతులు రైతుసేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఐ ఇంజినీర్ శ్రీనివాసరావు, బొద్దాం వీఏఏ శివశంకర్, ఎంఐఏఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

వంగర: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ఉత్తరాంధ్ర దళిత బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు మజ్జి గణపతి, దళితసేన రాష్ట్ర కార్యదర్శి ఎం.గణపతి అన్నారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలియజేశారు. బీజేపీ ప్రభుత్వం దళితులను, దళిత బహుజనులను విభజించే కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు డర్రు రాంబాబు, చిత్తిరి గంగులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: పంచాయతీలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొఠారిపురం సచివాలయాన్ని శనివారం పరిశీలించారు. గ్రామ పంచాయతీకి చెందిన 2023-24 రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీలో చేపట్టిన అన్ని పనులకు సంబంధించిన వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. రికార్డుల్లో అవకతవకలు ఉంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పరిశీలన



శంఖరపేటలో జ్వర పీడితుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస పంచాయతీలో జంట గ్రామాలైన ఎం.ఆర్.అగ్రహారం, శంఖరపేట గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. సంతకవిటి పీహెచ్‌సీ వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్య సేవలందిస్తున్నారు. డెంగీ ఆర్‌టీడీ పరీక్షలు, సీరం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కె.సూర్యనారాయణ, జిల్లా సహాయ మలేరియా అధికారి డి.వి.రమణ శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి అక్కడ పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో నెలకొన్న అపారిశుద్ధ్యాన్ని గుర్తించి సంబంధిత అధికారులు, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు.

తహసీల్దార్‌గా అప్పారావు

గుమ్మలక్ష్మీపురం: మండల తహసీల్దార్‌గా ఎస్.అప్పారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రెవెన్యూ సేవలు చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు.

పెన్నులు, నోటు పుస్తకాల వితరణ

బొబ్బిలి రూరల్: మండలంలోని పణుకువలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.విజయగౌరి పెన్నులు, నోటుపుస్తకాలు శనివారం వితరణ చేశారు. తనవంతు చేస్తున్న ఈ సాయం పిల్లల చదువుకు దోహదపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు.